# పోలింగ్‌కు సర్వం సిద్ధం

- పరిగి బరిలో 15 మంది అభ్యర్థులు
- పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలింపు
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్



ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లోకి తీసుకువస్తున్న సిబ్బంది



పరిగిలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

పరిగి, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అంతా సిద్ధమైంది. గురువారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసా గుతుంది. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. పరిగి అసెంబ్లీ నియో జకవర్గంలో తుది పోరులో 15 మంది అభ్యర్థులు నిలిచారు. పరిగి నుంచి 26 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా 11 నామినేషన్లు తిరస్కరణకు గురవగా 15 మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలు సక్రమంగా ఉన్నట్లు అధికారులు తేల్చారు. వారిలో ఎవరూ తమ నామినేషన్‌లను ఉపసంహరించుకోకపోవడంతో తుది పోరులో 15 మంది అభ్యర్థులు నిలిచారు. పరిగి అసెంబ్లీ స్థానంలో మారుతీ కిరణ్ బూనేటి(భారతీయ జనతా పార్టీ), డాక్టర్ తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి(ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), కె.మహేశ్‌రెడ్డి(భారత రాష్ట్ర సమితి), ఇ.ఆనందు(బహుజన సమాజ్ పార్టీ), శ్రీశైలం బాయికాని(సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి), భాస్కర్ బేగరి(తెలంగాణ రిపబ్లికన్ పార్టీ), మంగలి నరేష్(ధర్మ సమాజ్ పార్టీ), మహ్మద్ సలీం(భారత చైతన్య యువజన పార్టీ), మహేశ్‌రెడ్డి బరెడ్డి(అలియెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), పత్లావత్ గట్యానాయక్(బహుజన్ ముక్తి పార్టీ), ముకుంద నాగేశ్వర్(స్వతంత్ర), బోయిని రాఘవేంద్ర(స్వతంత్ర), దూదేకుల గౌస్(స్వతంత్ర), బేరి రాంచందర్‌యాదవ్(స్వతంత్ర), జి.మల్లేశం గౌడ్(స్వతంత్ర) అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పరిగి నియోజకవర్గంలో మొత్తం 2,59,422 మంది ఓటర్లుండగా వారిలో పురుషులు 1,31,163 మంది, మహిళలు 1,28,250 ఇతరులు 9 మంది ఉన్నారు. పరిగి నియోజకవర్గంలో 305 పోలింగ్ స్టేషన్లు ఉండగా, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక ఏపీవో, ఇరువురు ఓపీవోలు, బూత్ లెవల్ ఆఫీసర్లు ఉండనున్నారు. నియోజకవర్గంలో 165 పోలింగ్ స్టేషన్‌లలో వెబ్‌క్యాస్టింగ్ నిర్వహించనుండగా, 60 పోలింగ్ స్టేషన్‌ల బయట సైతం వెబ్‌క్యాస్టింగ్ నిర్వహించడం జరుగుతుంది. నియోజకవర్గంలో అయిదు మోడల్ పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 22 రూట్‌లు ఏర్పాటు చేయడంతో పాటు 22 మందిని సెక్టోరియల్ అధికారుల నియామకం జరిగింది.అలాగే 45 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. 456 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఒక డీఎస్పీ, నలుగురు సీఐలు, నలుగురు ఎస్‌ఐలు, కర్ణాటక నుంచి వచ్చిన 165 మంది హోంగార్డులు, 37 మంది ఎఆర్ హెడ్‌క్వార్టర్స్ నుంచి వచ్చిన పోలీసులు, ఐదుగురు శ్రీకాకుళం జిల్లా పోలీసులు, సీఎఆర్‌ఎఫ్‌కు సంబంధించి 90 మంది విధులు నిర్వహించనుండగా, గండీడ్, మహ్మదాబాద్ మండలాలకు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని పోలీసులు విధులు నిర్వహిస్తారు.

### డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి సామగ్రి తరలింపు

పరిగిలోని మినీ స్టేడియంలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సామగ్రిని పోలింగ్ స్టేషన్‌లకు తరలించారు. పోలింగ్ సిబ్బంది సంబంధిత పోలింగ్ స్టేషన్‌కు కేటాయించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఇతర పోలింగ్ సామాగ్రిని 27 పెద్ద బస్సులు, 15 చిన్న బస్సులలో తీసుకువెళ్లారు. ఆయా రూట్లలో 22 మంది సెక్టోరియల్ ఆఫీసర్లతో పాటుపోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ సామగ్రి తరలించారు.

### పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించాలి : కలెక్టర్

పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పోలింగ్ అధికారులకు సూచించారు. బుధవారం పరిగిలోని మినీస్టేడియంలో ఏర్పాటుచేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ విధులు నిర్వహించే అధికారులందరు సమష్టిగా పనిచేసి పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ సామగ్రి తీసుకువెళ్లిన వెంటనే తమ పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు సమకూర్చుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే నోడల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని అన్నారు. పోలింగ్ రోజున ఉదయం 5 గంటలకే సిబ్బంది కేంద్రాల్లో ఉండాలని, ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. మాక్ అనంతరం సీఆర్సీ చేసి, వీవీ ప్యాట్‌ల నుండి స్లిప్పులను తొలగించి మాక్ పోలింగ్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. ఉదయం 7 గంటలకు తప్పనిసరిగా పోలింగ్ మొదలు పెట్టాలని, పోలింగ్ క్రమంలో రెండు గంటలకు ఒకసారి తప్పనిసరిగా రిపోర్టును ఇవ్వాలని పేర్కొన్నారు. రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా విధులు నిర్వహించాలని అన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను సాధారణ ఎన్నికల పరిశీలకులు సుధాకర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి విజయకుమారి, డివైఎస్‌వో హనుమంతురావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్ పాల్గొన్నారు.

## కొడంగల్ నియోజకవర్గంలో 275 పోలింగ్ కేంద్రాలు




పోలింగ్ సిబ్బందికి సూచనలు, సలహాలను ఇస్తున్న డిప్యూటీ అదనపు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్

కొడంగల్, నవంబర్ 29: కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం పోలింగ్ సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిప్యూటీ అదనపు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్ తెలిపారు. పోలింగ్ సిబ్బందికి ఆర్‌వో అధికారి పోలింగ్‌కు ప్రక్రియకు సంబంధించిన సూచనలు సలహాలను అందించారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 275 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. మొత్తం ఓటర్లు 2,36,625 మంది కాగా ఇందులో పురుషులు 1,17,303, స్త్రీలు 1,19,310, ఇతరులు 12మంది ఉన్నారు. కాగా 164 మంది సర్వీసు ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికల బరిలో మొత్తం 13మంది ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియలో భాగంగా 29మంది సెక్టార్ అధికారులు, 1300 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్, అదనపు పోలింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 200 మంది సిబ్బందితో డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ చేపట్టినట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రతి మండలంలో మానిటరింగ్ చేసేందుకు ఒక్కొక్క టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 146 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, 90 పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్ , మరో 76పోలింగ్‌కేంద్రాల్లో బయట వెబ్‌కాస్టింగ్, పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు 36 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఐదు మహిళా, ఐదు మాడల్, ఒక యూత్, ఒక దివ్యాంగుల పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశారు. ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు గాను విధిగా ఓటరు ఐడెంటీ కార్డు, ఐడీ కార్డు తప్పకుండా దగ్గర ఉంచుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసుల బలగాలను తరలించినట్లు తెలిపారు. ఓటర్లు సమయానికుటే ముందుగానే ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరి జన సంక్షేమశాఖ అధికారి కోటాజీ, తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



కొడంగల్: ఈవీఎం మిషన్లను పరిశీలిస్తున్న అధికారులు

**బొంరాస్‌పేట:** గురువారం జరిగే శాసనసభ సాధారణ ఎన్నికల పోలింగ్‌కు బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బొంరాస్‌పేట మండలంలో 38 పోలింగ్ కేంద్రాలు 30,908 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 15420 మంది పురుషులు, 15481 మంది మహిళలు, ఏడుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. దుద్యాల మండలంలో 29 పోలింగ్ కేంద్రాలు ఉండగా 23265 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 11488 మంది పురుషులు, 11777 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే అధికారులు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు సామగ్రిని తీసుకుని సాయంత్రానికి చేరుకుని పోలింగ్‌కు ఏర్పాట్లు చేసుకున్నారు. పోలీసు సిబ్బంది కూడా తమకు కేటాయించిన కేంద్రాలకు సిబ్బందితో పాటు చేరుకున్నారు. వంద మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఒక డీఎస్పీ, ముగ్గురు సీఐల ఆధ్వర్యంలో ఈ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అదేవిధంగా రెండు మండలాల్లో ఏడు గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. బొంరాస్‌పేట, తుంకిమెట్ల, రేగడిమైలారం, వడిచెర్ల, కొత్తూరు, మహాంతిపూర్, ఎనికేపల్లి, దుద్యాల గ్రామాల పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి ఎలాంటి గొడవలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బందోబస్తుకు కర్నాటక పోలీసులతో పాటు జిల్లా పోలీసులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

**మహ్మదాబాద్:** ఉమ్మడి గండీడ్, మహ్మదాబాద్ మండలాల్లో 69 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మహ్మదాబాద్ మండలంలో 37 కేంద్రాలు ఉండగా గండీడ్‌లో 32 కేంద్రాలు ఉన్నాయి. గండీడ్ మండలంలో మొత్తం ఓటర్లు 28వేల 178 మంది ఉండగా అందులో స్త్రీలు 16,632, పురుషులు 13, 849 మంది ఉన్నారు. గండీడ్ మండలంలో 14422 మంది స్త్రీలు ఉండగా 14661 మంది పురుషులు ఉన్నారు. ఒక్కో బూత్‌కు ఐవు మంది ఎన్నికల సిబ్బంది, ఒక మైక్రో అబ్జర్వర్ చొప్పున ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు అధికారులు తెలిపారు. మొత్తం ఉమ్మడి మండలాలకి 414 మంది సిబ్బందిని ఎన్నికల అధికారులు నియమించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 130 మంది పోలీసు బలగాలతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

### ఆకర్షణీయంగా మాడల్ పోలింగ్ కేంద్రాలు



అందగా ముస్తాబు చేసిన 179వ పోలింగ్ కేంద్రం

బొంరాస్‌పేట: ఓటు వేయడానికి వచ్చే ఓటర్లను ఆకర్షించడానికి మాడల్ పోలింగ్ కేంద్రాలను ఆకర్శణీయంగా తీర్చిదిద్దారు. బొంరాస్‌పేట మండల కేంద్రం లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 179వ పోలింగ్ కేంద్రాన్ని మాడల్ పోలింగ్ కేంద్రంగా తీర్చిదిద్దారు. పోలింగ్ కేంద్రం ద్వారానికి రంగు రంగుల బెలూన్లు, టెంటు ఏర్పాటు చేసి కొబ్బరి మట్టలు, మామిడాకు తోరణాలు కట్టారు. ఓటర్లు ఆహ్లాదకరమైన వాతావరణంలో వచ్చి ఓటు వేయడానికి దీనిని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.



దుద్యాల మండలం చెట్టుపల్లితండాలో...